# సాక్షి నంద్యాల

బుధవారం। 6। సెప్టెంబర్। 2023






## పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకుడు శ్రీబయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఎమ్మిగనూరుకు చెందిన డి.సత్యనారాయణస్వామి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



## కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి మంగళవారం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 0.581 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## న్యూస్‌రీల్

### హంద్రీ నుంచి నీటి ప్రవాహం

శ్రీశైలం ప్రాజెక్ట్: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా హంద్రీ నది నుంచి మంగళవారం శ్రీశైలానికి స్వల్పంగా వరద ప్రవాహం మొదలైంది. హంద్రీ నుంచి 183 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరగా.. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 5,656 క్యూసెక్కుల నీరు విడుదలైంది. సోమవారం నుంచి మంగళవారం వరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,230, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 2.20 మి.మీ వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 81.4594 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 850.60 అడుగులకు చేరుకుంది.

### 10వరకు పెన్షన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పెన్షన్ల పంపిణీ 10వ తేదీ వరకు కొనసాగనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు కొత్త పింఛన్లు 10,962 మంజూరు కాగా ఇప్పటి వరకు 4,956 పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన పింఛన్లను పదో తేదీలోపు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంజూరైన పాత, కొత్త పింఛన్లు పంపిణీ ఇప్పటి వరకు 98.9శాతం పూర్తయినట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

### ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి



ఆర్టీసీ బస్టాండ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఆళ్లగడ్డ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ కడప రీజియన్ ఈడీ వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండు ఆవరణలో వ్యాపారాల దుకాణాలు, హోటళ్లను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపోలో గతంతో పోలిస్తే 20 శాతం నష్టాలు తగ్గడం సంతోషకరమన్నారు. కార్మికుల అందరి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. బస్టాండ్, డిపోలో ఉన్న సమస్యలతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. సంస్థకు ఆదాయ మార్గాలను అన్వేషించి ఆయా రూట్లలో బస్సుల సంఖ్య పెంచేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. ఈయన వెంట డిపో మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

### 9న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు (టౌన్) : ఈనెల 9 వ తేదీ ఉదయం 10 గంటలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మండలాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి. రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెలిఫోన్ బిల్లులు బకాయి ఉన్న వినియోగదారులు కోర్టు వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లా, మండల న్యాయ సేవాధికారి కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు, డోన్, కోవెలకుంట్ల, బనగానపల్లె, ఎమ్మిగనూరు, ఆదోని, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూర్, పత్తికొండ పరిధిలోని లోక్ అదాలత్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత బకాయిలను ముందుగానే చెల్లించిన వినియోగదారులు తమ దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 08518-220721 టెలిఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పదకండ్లలో వీడియో ద్వారా ఇంగ్లిష్ అక్షరాలు నేర్పిస్తున్న దృశ్యం



# ఆట.. పాట.. భవితకు బాట!

- సత్ఫలితమిస్తున్న 'ఇంటివద్దకే విద్య – ఆటపాటల విద్య' కార్యక్రమం
- బుజ్జాయిలకు వీడియోలతో విద్యాబోధన
- ప్రత్యేకంగా తల్లుల వాట్సాప్ గ్రూపు ఏర్పాటు

ప్రస్తుతం ఏ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకెళ్లి చూసినా మార్కులే ప్రామాణికంగా బట్టీ కొట్టే చదువులు కొనసాగుతున్నాయి. దీని వల్ల పిల్లలపై మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఇందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనందిస్తోంది. చిన్నారులను ఆకట్టుకునేలా ఆటవస్తువులు, రంగురంగు బొమ్మలతో పాఠాలు బోధిస్తోంది. దీంతో పాటు పిల్లల వికాసానికి దోహదపడేలా వీడియోపాఠాలతో ఇళ్ల వద్ద పునశ్చరణ జరిగేలా 'ఇంటివద్దకే విద్య – ఆటపాటల విద్య' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఈ వినూత్న కార్యక్రమం జిల్లాలో సత్ఫలితాలిస్తోంది.

| | |
|---|---|
| జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు | 8 |
| జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు | 1,620 |
| మినీ అంగన్‌వాడీ కేంద్రాలు | 43 |
| గర్భిణులు 14,319 | బాలింతలు 13,077 |

| 0 – 6 నెలల శిశువులు | |
|---|---|
| బాలలు | బాలికలు |
| 8,537 | 8,011 |
| 7 నెలల నుంచి 1 సంవత్సరం లోపు | |
| 7,641 | 7,057 |
| 1 సంవత్సరం నుంచి 3 ఏళ్ల లోపు | |
| 25,974 | 24,163 |
| 3 నుంచి 6 సంవత్సరాల లోపు | |
| 20,009 | 19,453 |

ఆళ్లగడ్డ: సెలవు దినాలు, ఖాళీ సమయాల్లో చిన్నారుల విద్యాభ్యాసానికి, తల్లులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయాలను మరింత మెరుగు పరిచేందుకు సమగ్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) వినూత్న ఆలోచన చేసింది. తమ సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టింది. సాంకేతికతను అందిపుచ్చుకుని సేవల్లో పలు మార్పులు తీసుకొచ్చింది. తల్లిదండ్రుల వాట్సాప్ నంబరులతో గ్రూపులు ఏర్పాటు చేసి 'ఇంటివద్దకే విద్య – ఆటపాటల విద్య'' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చిన్నపిల్లలకు ఒత్తిడి లేకుండా గుర్తిండిపోయేలా ఆటపాటలతో కూడిన విద్యతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, శారీరక మానసిక ఉల్లాసానికి దోహదం చేసేలా నిత్యం ఒక కొత్త అంశాన్ని వీడియో రూపంలో పంపి ఖాళీ సమయాల్లో వాటిని పిల్లలకు నేర్పించడంతో పాటు తల్లులు అవగాహన పొందడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

**రోజుకో అంశం..**

చిన్నారుల మానసిక ఉల్లాసానికి దోహదం చేసేలా ఇంటివద్దే ఆడుతూ.. పాడుతూ చిన్నచిన్న కథలను వాట్సాప్ గ్రూపుల్లో పెడుతారు. రోజు ఒక ఆంగ్ల పదం నేర్పిస్తారు. ఆడుతూ పాడుతూ నేర్చుకునేలా కొత్త అంశాలు, పాటలను వీడియోల రూపంలో తల్లుల సెల్ ఫోన్ వాట్సాప్‌లకు పంపిస్తారు. వీటిని ఇంటివద్ద ఖాళీ సమయంలో చిన్నారులు చూసి సాధన చేయించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు.

**ఎప్పుడు.. ఏం తినాలి..**

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తగినంత విశ్రాంతి తీసుకోవడంతో పాటు తల్లి, బిడ్డకు తగిన పోషకాలు అందాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి, వాటిని ఎలా తయారు చేసుకోవాలి. ఏఏ మందులు ఏ సమయంలో వేసుకోవాలి తదితర అంశాలను వాట్సాప్‌లో మెసేజ్ ద్వారా అవగాహన కల్పిస్తారు. ఏమాత్రం అనారోగ్య లక్షణాలున్నా ఆలస్యం చేయకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఎన్ఎంలకు తెలియజేయాలని సూచిస్తారు. బాలింతలు ప్రసవమైన ఆరు నెలల వరకు పిల్లలకు పాలు ఇచ్చేలా చూడటంతో పాటు వ్యాక్సినేషన్ గురించి వాట్సాప్‌మెసేజ్ ద్వారా గుర్తు చేస్తారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా బియ్యం, గుడ్లు, బెల్లం, పాలు, కంది పప్పు, అటుకులు, రాగిపిండి, ఖర్జూరం, చిక్కీలు తదితర వాటిని సకాలంలో తీసుకునేలా అప్రమత్తం చేస్తున్నారు.

**బుజ్జాయిలకు గుర్తుండిపోయేలా!**

అంగన్‌వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం బోధించే పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలను ముందుగానే తల్లుల సెల్‌ఫోన్‌లకు వాట్సాప్ పంపిస్తారు. 3, 4 ఏళ్ల లోపు పిల్లలకు పి పి – 1, నాలుగేళ్లు పైబడిన వారికి పి పి – 2 పాఠ్యాంశాలను వాట్సాప్ గ్రూపుల్లో పంపిస్తారు. అక్షరాస్యులైన తల్లులు, కుటుంబ సభ్యులు వీటిని పనిశీలించి చిన్నారులకు ఇంట్లో మరోసారి వివరించాల్సి ఉంటుంది.



### చాలా బాగుంది

ఇక్కడ మంచంపై కూర్చుని తన ఇద్దరు చిన్నారులకు ఆట పాటలు చూపిస్తూ పలికిస్తున్న మహిళ పేరు కరిమూన్. పట్టణంలోని విజయపురి కాలనీకి చెందిన ఈమె గర్భిణిగా ఉన్నప్పుడు సమీపంలోని అంగన్‌వాడీ కార్యకర్త తల్లుల గ్రూప్‌లో కరిమూన్ సెల్‌నంబర్ యాడ్ చేసింది. అప్పటి నుంచి రోజు ఏం తినాలి, ఏఏ మందులు వేసుకోవాలి అన్న విషయాలతో పాటు పిల్లలకు నేర్పించాల్సిన ఇంగ్లిష్ అక్షరాలు వాట్సాప్‌కు పంపిస్తారు. మా కోసం ప్రభుత్వం ఇంత మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని ఆమె చెబుతున్నారు.

### ఇంగ్లిష్ రెయిమ్స్ బాగా గుర్తు పెట్టుకుంటున్నారు

తన సెల్ ఫోన్‌లో ఇంగ్లిష్ రెయిమ్స్ చూపిస్తూ పలికిస్తున్న ఈమెపేరు సుమలత. ఆళ్లగడ్డ రూరల్ మండలం జి.జమ్ములదిన్నె. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త తల్లులకు అందరికి ఒక గ్రూప్ ఏర్పాటు చేసి అందులో 'ఇంటివద్దకే విద్య – ఆటపాటల విద్య' కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలు వేస్తుంది. సుమలత వాటిని ఖాళీ సమయంలో, సెలవు దినాల్లో పిల్లలకు చూపిస్తూ పలికిస్తుంది. దీని వల్ల తన పిల్లలు ఇంగ్లిష్ రెయిమ్స్ మరిచిపోకుండా బాగా గుర్తుకు పెట్టుకుంటున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.






వాట్సాప్‌ల్లో పంపిన 'ఇంటివద్దకే విద్య - ఆటపాటల విద్య' వీడియో సందేశం

### సద్వినియోగం చేసుకోవాలి



తల్లీ బిడ్డల సంరక్షణతో పాటు చిన్నారులకు సులువుగా అర్థమయ్యేలా సృజనాత్మకంగా బోధన అందించేందుకు ప్రభుత్వ ఆదేశానుసారం ప్రత్యేకంగా తల్లుల గ్రూప్‌లను ఏర్పాటు చేస్తున్నాం. అందులో చిన్నారులు, తల్లులు, గర్భిణులు ఎలా నడుచుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వీడియోలు పంపించడంతో పాటు ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత కార్యకర్తతో వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చేసి నివృత్తి చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నాం.

– నిర్మల, స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత జిల్లా అధికారిణి

## శ్రీశైలం నూతన ఈఓగా డి.పెద్దిరాజు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థాన నూతన కార్యనిర్వహణాధికారిగా డి.పెద్దిరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 35మంది డిప్యూటీ కలెక్టర్లను, ఆర్డీఓలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం దేవస్థాన ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్.లవన్నను గుంతకల్లు ఆర్డీఓగా బదిలీ చేస్తూ, శ్రీశైలం ఆలయానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.పెద్దిరాజును ఈఓగా నియమించింది. డి.పెద్దిరాజు ప్రస్తుతం కడప జిల్లా ట్రాన్స్‌పోర్టు, రోడ్లు, భవనాల శాఖ, భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన గతంలో పశ్చిమగోదావరి, అనంతపురం, కడప జిల్లాలో పని చేశారు.

శ్రీశైల క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తా: డి.పెద్దిరాజు



గతంలో ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి ఆలయాల ఈఓగా పని చేసిన అనుభవం ఉంది. మల్లన్న ఆశీస్సులతో శ్రీశైల క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తా. జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలసి వెలసిన పుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఈవోగా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా. చాలా సంతోషంగా ఉంది.

## నవ నారసింహ క్షేత్రాలను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలం నల్లమల అడవిలో కొలువైన నవనారసింహ క్షేత్రాలను హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ సోమయాజులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవా రం అహోబిలం చేరుకున్న ఆయన రాత్రి దిగువ అహోబిలంలో బసచేసి మంగళవారం వేకువ జామునే నల్లమల అడవిలో కాలినడకన జ్వాలా నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఉగ్ర స్తంభం దర్శించుకుని నవ నారసింహ క్షేత్రాల్లో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్ల శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలతో వేద ఆశీర్వచనాలు అందించారు. ఈయన వెంట సీఐ హనుమంత్‌నాయక్, తదితరులు ఉన్నారు.



నల్లమల అడవిలో కాలినడకన వెళ్తున్న హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ సోమయాజులు

## విద్యతోనే సమాజాభివృద్ధి

- పేదల చదువులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాలను సాధించాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, హబీబుల్లా, డీఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు

నంద్యాల(న్యూటౌన్): సమాజాభివృద్ధి విద్యతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డీఈవో సుధాకర్ రెడ్డి, డీవీఈఓ సునీత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి నాడు–నేడు కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అలాగే జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, ఆణిముత్యాలు తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. 5–18 సంవత్సరాల్లోపు బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలన్న ప్రధాన ఉద్దేశంతో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే ప్రభుత్వం సీరియస్‌గా చేపట్టిందన్నారు. జిల్లాలో ఇంకా దాదాపు 4వేల మంది పిల్లలు బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నారని సంబంధిత విద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి అనేక సంస్కరణలను ప్రవేశపెట్టిందన్నారు. శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా మాట్లాడుతూ ఏ స్థాయిలో ఉన్నా గురువు లేనిదే ఉన్నత స్థాయి లభించదన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేద కుటుంబం నుంచి ఉపాధ్యాయ వృత్తిలో రాణించి ఆ తర్వాత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి అనేక ఉన్నత పదవులు అలంకరించారన్నారు. నాడు–నేడు కింద ఉపాధ్యాయులకు విద్యతో పాటు మరిన్ని బాధ్యతలు పెరిగాయన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతోపాటు ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సన్మార్గంలో నడిచి మంచి ప్రవర్తనతో మెలగాలంటే విద్య అత్యంత ఆవశ్యకరమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా పిల్లలను బాగా చదివించి మంచి భవిష్యత్తు ఇవ్వాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన కోరారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైద్య, విద్యా రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం ఎంపికైన 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అతిథులు మెమొంటో, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

## ఖరీఫ్‌కు వర్షం

- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- ఖరీఫ్‌కు ప్రాణం పోసి వాన
- సెప్టెంబర్ నెల జిల్లా సాధారణ వర్షపాతం 134 మి.మీ
- మూడు రోజుల్లోనే 85.7 మి.మీ వర్షపాతం నమోదు
- సోయా, మొక్కజొన్న, పత్తి, మిరప, మినుము, కందికి తప్పిన బెట్ట ముప్పు



నంద్యాల మండలం మునగాల వద్ద పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

నంద్యాల(సెంట్రల్): వర్షాభావ పరిస్థితులతో పంటలు వాడుతున్న సమయంలో మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌కు వరంగా మారాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 2,38,130 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,31,262 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. కోటి ఆశలతో సాగు చేసిన పంటలు వానలు లేక తీవ్ర బెట్ట ముప్పును ఎదుర్కొంటున్న తరుణంలో వరుణుడు కరుణించాడు. ఖరీఫ్ పంటలకు ఊపిరి పోసినట్లుగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన వీడుతున్నారు. జూలై, ఆగస్టు నెల సాధారణ వర్షపాతంలో సగం కూడా నమోదు కాకపోవడంతో పంటలు చేతికందని పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్ నెలలో మరో పది రోజుల పాటు వర్షాలు కురవకపోయినట్టైతే పంటలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో వరుణుడు ఖరీఫ్ పంటలకు ఊపిరిపోశాడు. సెప్టెంబర్ నెల జిల్లా సాధారణ వర్షపాతం 134 మి.మీ కాగా మూడు రోజుల్లోనే 85.7 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో సోయా, మొక్కజొన్న, పత్తి, మిరప, మినుము, కంది పంటలకు బెట్ట ముప్పు తప్పింది. పంటలు తేరుకుని పచ్చగా కళకళలాడుతున్నాయి. పొలాల్లో వర్షపు నీరు నిలుస్తున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు అత్యధికంగా ఆత్మకూరులో 33.4 మి.మీ, అత్యల్పంగా అవుకు మండలంలో 1.4 మి.మీల వర్షపాతం నమోదైంది.

### జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు (మి.మీలలో)

| మండలం | వర్షపాతం | మండలం | వర్షపాతం |
|---|---|---|---|
| కొత్తపల్లె | 20.4 | గోస్పాడు | 10 |
| మహానంది | 17.6 | ఆళ్లగడ్డ | 10 |
| వెలుగోడు | 17.4 | కోవెలకుంట్ల | 8.8 |
| రుద్రవరం | 17.2 | గడివేముల | 8.2 |
| శిరివెళ్ల | 14.4 | సంజామల | 7.4 |
| బండిఆత్మకూరు | 13.8 | బేతంచెర్ల | 7.2 |
| నంద్యాల | 12.6 | పాణ్యం | 7 |
| బనగానపల్లె | 12.4 | జూపాడుబంగ్లా | 6.8 |
| చాగలమర్రి | 10.6 | పాములపాడు | 6.4 |
| డోన్ | 10.4 | మిడుతూరు | 6.2 |
| దొర్నిపాడు | 10.2 | ప్యాపిలి | 5.8 |
| | | ఉయ్యాలవాడ | 4.6 |

### గర్భిణులకు ఉచితంగా టిఫా స్కానింగ్

కర్నూలు(హాస్పిటల్): గర్భంలో ఉన్న శిశువు లోపాలను గుర్తించేందుకు గర్భిణులకు ఉచితంగా టిఫా స్కానింగ్ చేయిస్తున్నట్లు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత తెలిపారు. మంగళవారం స్థానిక జొహరాపురంలోని యుపీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు ఆశాడే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చిన్నారులు జన్మించేంత వరకు వారి లోపాలు బయటపడటం లేదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఉచితంగా టిఫా స్కాన్ చేయించేందుకు నిర్ణయించిందన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆమెకు అందుతున్న వైద్యసేవలు, పరీక్షలు, టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు గర్భిణిలు, బాలింతల ఇళ్లకు వెళ్లినప్పుడు వారు తీసుకోవాల్సిన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, టీకాల గురించి అవగాహన కల్పించాలన్నారు.

## క్లుప్తంగా

### చేతివృత్తుల బలోపేతమే విశ్వకర్మ యోజన లక్ష్యం

నంద్యాల(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపార బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన లక్ష్యమని నంద్యాల జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పథకం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి చర్యలు తీసుకోవాలన్నారు. 18 రకాల వృత్తి, హస్త కళాకారుల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉందన్నారు. లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై వలంటీర్లకు శిక్షణ నివ్వాలని, నైపుణ్య కేంద్రాలనూ గుర్తించాలన్నారు. ఈ పథకానికి 18 రకాల చేతివృత్తిదారులు అర్హులని, వారికి సర్టిఫికెట్, గుర్తింపు కార్డు, రూ.3 లక్షల వరకు హామీ లేని రుణం, రూ.15 వేల విలువైన పనిముట్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కవచ తయారీ, కమ్మరవాడు కమ్మర, సాధనం పనిముట్లు, తాళాల తయారీదారులు, శిల్పి, వెండి, బంగారం, మొదలైన లోహాలతో ఆభరణాలు చేయు స్వర్ణ శిల్పి, కుమ్మరి, చెప్పులు కుట్టు వాడు, తాపీ మేస్త్రీ, బుట్ట తయారీ, బొమ్మల తయారీ, పూలమాలలు అల్లేవారు, దాభా, దర్జీలు, చేపల వల తయారీ తదితర వృత్తుల వారిని గుర్తించాలన్నారు. వివరాలకు పద్మావతినగర్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

### 7న గోకులంలో విశేష పూజలు




శ్రీశైలం ఆలయప్రాంగణంలోని శ్రీగోకులం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని గోకులంలో ఈ నెల 7వ తేదీ గురువారం గోకులాష్టమి పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి ఆలయప్రాంగణంలోని శ్రీగోకులం వద్ద గోవులకు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహిస్తామన్నారు. వేదసంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉందని, మన వేదాలు ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు మొదలైనవన్నీ కూడా గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొన్నారన్నారు. గోవు సకల దేవతలకు ఆవాసస్థానమని, అంతే కాకుండా గోపూజలను ఆచరించడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని, శాస్త్రాలు తెలుపుతున్నాయన్నారు. ముఖ్యంగా జగన్మాత లలితా పరమేశ్వరి గోవు రూపంలో భూమి పై సంచరిస్తుందని లలితా సహస్రనామం తెలియజేస్తుందన్నారు. కాగా తాను చేసిన ప్రతిపనిలోనూ వైశిష్ట్యాన్ని బోధించిన శ్రీకృష్ణపరమాత్మ ఆవుల మంద అధికంగా ఉన్న కారణంగా గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచి, గోవు యొక్క అనంతమహిమను లోకానికి తెలియజేశారన్నారు. ఈ కారణంగానే గోకులాష్టమి రోజున గోవును పూజించడం సంప్రదాయం అయిందని పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలు


సూర్యశేఖర్‌రెడ్డి, డోన్ ఐటీఐ కళాశాల శిక్షణ అధికారి


రఘునాథ్‌రెడ్డి, బండిఆత్మకూరు జూనియర్ కళాశాల అధ్యాపకుడు


నిర్మల జ్యోతి, కరిమద్దెల ఎంపీపీ స్కూల్, గడివేముల మండలం


దస్తగిరమ్మ, గడిగరేవుల జెడ్పీస్కూల్, గడివేముల మండలం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విశాఖ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా జిల్లా నుంచి ఐదుగురు ఈ అవార్డులు అందుకున్నారు.

– నంద్యాల (న్యూటౌన్)


విశాఖ పట్టణంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న కొలిమిగుండ్ల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె. బాలసుబ్బారెడ్డి

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చేతుల మీదుగా జిల్లాస్థాయి అవార్డు అందుకుంటున్న బనగానపల్లె మండలం యాగంటిపల్లె ఉపాధ్యాయిని పద్మావతి, చిత్రంలో మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, డీఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో మంగళవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించి జిల్లాస్థాయి పురస్కారాలు అందజేశారు.

– నంద్యాల (న్యూటౌన్)


లీలావతమ్మ ఎం.తిమ్మాపురం | సి.ప్రసాద్ టెక్కె నంద్యాల | షఫకతుల్లా నంద్యాల | పద్మావతి నూనెపల్లె | మధుసూదనరాజు పోలూరు | ఇఫ్రత్‌బేగం నంద్యాల | సురేష్‌బాబు ఎన్‌ఎన్ కాలనీ | శ్రీనివాసులు పీఆర్ పల్లి | షేక్ ఆస్మాబేగం పోతిదొడ్డి | రమాదేవి రైతునగర్

సుబ్రమణ్యం వెలుగోడు | మధుసూదన రావు నందవరం | నాగరాజు ఆళ్లగడ్డ | నారాయణరెడ్డి కనకాద్రిపల్లి | విజయలక్ష్మి మిడుతూరు | కృష్ణయ్య దుద్యాల | రామకృష్ణారెడ్డి యల్లావత్తుల | ఎలిశమ్మ ప్రాతకోట | శ్రీనివాసులు ఎర్రగుంట | రాజేశ్వరమ్మ డబ్ల్యు.గోవిందిన్ని

అశోక్‌రెడ్డి కడమలకాల్వ | నాగేశ్వరరెడ్డి అల్వకొండ | రాజశేఖర్‌రెడ్డి హనుమాన్‌నగర్ | వాజిదున్నిసాబీ సీతారాంపురం | వెంకటరాముడు చాగలమర్రి | రామలక్ష్మమ్మ తిమ్మాపురం | వెంకటేశ్వర్లు ఓబులంపల్లి | శ్రీలేఖ సంజామల | అయూబ్ అహమ్మద్ ఆత్మకూరు | కె.దుర్గాబాయి ఆత్మకూరు

## భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు


సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలోని చైర్మన్ కార్యాలయంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం లోపలి కోనేరు వద్ద మహిళా భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు ఏర్పాట్లు వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కోనేరులకు నూతన మెట్ల నిర్మాణంపై స్థపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. భక్తులకు అందించే లడ్డూ, వడప్రసాదాల ధరల పెంపుపై కమిటీ వేసి తయారీ, విక్రయాలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలపై పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ధర్మకర్తల మండలి సభ్యులు తీర్మానించారు. ఆలయం ముందు ఉన్న నవదుర్గలు, నవవినాయకులతో పాటు రథశాల షట్టర్‌కు పెయింటింగ్ పనులు చేయిస్తామన్నారు.దేవస్థానం పరిధిలో అనువైన ప్రదేశాలలో భక్తుల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ధర్మకర్త హేమలత విజ్ఞప్తి చేయగా తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ధర్మకర్తలు రామతులశమ్మ, హేమలత, పార్వతమ్మ, లక్ష్మీదేవి, గంగిశెట్టి మల్లికార్జున, వీరభద్రుడు, బుసకాని వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు అడవిలోకి ఎలుగుబంటి


ప్రత్యేక వాహనంలో తరలించి ఎలుగుబంటిని అడవిలో వదిలిపెడుతున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్ర పరిధిలో నాలుగు రోజులుగా అందరినీ భయభ్రాంతులకు గురిచేసిన ఎలుగుబంటిని అటవీశాఖ అధికారులు క్షేమంగా అడవిలో వదిలేశారు. సోమవారం రాత్రి మహానందిలోని పాడుబడిన గదిలోకి ఎలుగుబంటి వెళ్లిన విషయం తెలిసిందే. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ జుబేర్, వైద్యుల పర్యవేక్షణలో ట్రాంక్‌లైజింగ్ ద్వారా మత్తు మందు ఇచ్చారు. అనంతరం నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు చెందిన వన్యప్రాణుల రక్షణ ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి ముందుగా గాజులపల్లె ఆర్‌ఎస్‌లోని అటవీ డిపోలో ఉంచారు. అనంతరం అక్కడి నుంచి చలమ రేంజ్ పరిధిలోని అడవిలోకి తీసుకెళ్లి వదిలారు. డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్ఎస్ఓలు రష్మీమణి, ఎల్లమ్మ, ఎఫ్‌బీఓ ప్రతాప్, రెస్క్యూటీం సభ్యులు ఉన్నారు. కాగా మహానంది క్షేత్ర పరిధిలో మరో పిల్ల ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## పీఆర్‌లో పదోన్నతులు


ఉత్తర్వులు అందించిన జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్, మండల పరిషత్, జెడ్పీ ఉన్నత పాఠశాల, పీఆర్, పీఐయూ ఇంజనీరింగ్ విభాగాల్లో ఆఫీస్ సబార్డినేట్లు(వాచ్‌మెన్, స్వీపర్లు)గా విధులు నిర్వహిస్తున్న 13 మందికి రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి వారికి పోస్టింగ్ ఉత్తర్వులను అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు మురళీమోహన్‌రెడ్డి, బసవశేఖర్ పాల్గొన్నారు. ఈ మేరకు పీఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు లచ్చన్న, మధు వెంకటేశ్వరరావు తదితరులు జెడ్పీ చైర్మన్, సీఈఓ, డిప్యూటీ సీఈఓకు కృతజ్ఞతలు తెలిపారు.

## పచ్చదనం మెరిసేలా.. భక్తులు మురిసేలా!

- పర్యావరణ పరిరక్షణకు దేవస్థానం ప్రత్యేక శ్రద్ధ
- ఇప్పటికే పలు పూలతోటలు, వనాల నిర్వహణ
- ఔటర్‌రింగ్ రోడ్డు వెంట 8 వేల మొక్కల పెంపకం


ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన మొక్కలు


శ్రీశైలంలో వివిధ రకాల పూలతోటలు, ఉద్యాన వనాలు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించేందుకు శ్రీశైల దేవస్థానం చర్యలు చేపట్టింది. మల్లన్న దర్శనార్థం తరలి వచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసి పూల తోటలు, ఉద్యానవనాలను నిర్వహిస్తోంది. అలాగే ఉభయ దేవాలయాల ప్రాంగణంలో భక్తులను ఆహ్లాదపరిచేలా గార్డెనింగ్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం పచ్చదనానికి మరింత ప్రాధాన్యత ఇస్తూ ఔటర్‌రింగ్ రోడ్డు వెంట, డివైడర్ మధ్యలో దాదాపు 8 వేలకు పైగా మొక్కలను నాటారు. వీటిలో దేవతా వృక్షాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. శ్రీశైల దేవస్థానంలో తోటల నిర్వహణకు ప్రత్యేకంగా హార్టికల్చర్ విభాగం ఉంది. ఈ విభాగంలో ఉద్యానవన అధికారితో పాటు సుమారు 150 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు దేవస్థానం పలు చోట్ల మొత్తం 35 ఎకరాల విస్తీర్ణంలో 10 ఉద్యానవనాలను నిర్వహిస్తోంది. ఈ ఉద్యానవనాలు భక్తులు సేద తీరేందుకు ఉపయోగపడుతున్నాయి. అలాగే స్వామిఅమ్మవార్ల నిత్యకైంకర్యానికి అవసరమైన పూల కోసం క్షేత్రపరిధిలో పలుచోట్ల మొత్తం 30 ఎకరాల విస్తీరణంలో తోటలు పెంచబడుతున్నాయి. రోజుకు 70 కేజీల పూలు ఈ మొక్కల ద్వారా లభిస్తున్నాయి. ఉభయ దేవాలయాల ప్రధాన ఆలయం, పరివార ఆలయాలలోని నిత్య కైంకర్యాలకు వినియోగిస్తారు.

### ఆకట్టుకుంటున్న అరుదైన మొక్కలు

శ్రీశైల క్షేత్ర పరిధిలోని ఔటర్‌రింగ్‌రోడ్డు వెంట ఇరువైపులా, పార్కింగ్ ప్రదేశాలలో సుమారు 2వేలకు పైగా మొక్కలు నాటారు. కడియపులంక నర్సరీ రైతులు ఈ మొక్కలను విరాళంగా ఇచ్చారు. అలాగే ఔటర్‌రింగ్‌రోడ్డు వెంట డివైడర్ మధ్యలో పోగడ, సువర్ణ గన్నేరు, బోగన్‌విల్లియా తదితర సుమారు 6వేల మొక్కలను నాటారు. భ్రామరీ పుష్పవనంలో కొబ్బెర, మామిడి తదితర 200 మొక్కలను నాటి పెంచుతున్నారు. ఇంకా పార్కింగ్ ప్రదేశాలలో, ఇంటర్నల్ రోడ్స్‌కు ఇరువైపులా విరివిరిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు గాను ట్రీగార్డ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో రావి, మర్రి, జువ్వి, కదంబము, బాహ్రూనియా, మహాగని, కానుగ, వేప, నేరేడు, పొగడ, సుంకేసులు, బిగ్నోనియా, పనస, టుబులియా రోజియా, జకరండ తదితర మొక్కలను నాటారు.


ఔటర్‌రింగ్‌రోడ్డు సెంట్రల్ మీడియన్స్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు

### భక్తులను ఆహ్లాదపరిచేలా



శ్రీశైలక్షేత్ర పరిధిలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దేవస్థానం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పలు ఉద్యానవనాలు, పూల మొక్కలను పెంచుతున్నాం. ఉభయ దేవాలయాల పరిధిలో పలు చోట్ల భక్తులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ చేస్తున్నాం. అలాగే అవుటర్ రింగ్ రోడ్డు వెంట సుమారు 8 వేల మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. క్షేత్ర పరిధి మొత్తం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. – ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి



## వినాయక నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- వర్షాభావం నేపథ్యంలో చిన్న చిన్న మట్టి విగ్రహాలను పూజించాలి
- ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 26వ తేదీన కర్నూలులో నిర్వహించే గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. 18వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గణేష్ నిమజ్జనం నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కేసీ కెనాల్‌కు నీటి విడుదలపై సందిగ్ధత నెలకొందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని చిన్న చిన్న మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజించాలని ఆమె భక్తులకు సూచించారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవాలు జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కర్నూలు వినాయక ఘాట్‌లో ఏడు భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణన్న తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మిద్దె కూలి వృద్ధురాలి మృతి


మృతి చెందిన వనం నాగమ్మ


కూలిన ఇంటి పైకప్పు

పాణ్యం: మట్టి మిద్దె కూలి ఓ వృద్ధురాలి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని కౌలూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వనం నాగమ్మ (70) అదే గ్రామంలో నివాసముంటున్న శివనాగమ్మ ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఇద్దరు కూర్చొని మాట్లాడుకుంటుండగా నాలుగు రోజులుగా కురుస్తున్న వానకు తడిసిపోయిన మిద్దె పైకప్పు ఒక్కసారిగా వారిపై కూలిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన వారిని మటిని తొలగించి బయటకు తీశారు. అప్పటికే వనం నాగమ్మ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన శివనాగమ్మను ఆటోలో శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. కాలక్షేపం కోసం స్నేహితురాలి ఇంటికి వచ్చిన వనం నాగమ్మ మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా గాయపడిన మహిళను తరలించే సమయంలో కౌలూరు వద్ద గూడ్సు వస్తుండటంతో రైల్వే గేటు పడటంతో 20 నిమిషాలు అంబులెన్స్ నిలిచిపోయింది.

## పెయ్య దూడల అభివృద్ధిపై అవగాహన కల్పించండి

- పశువైద్యులకు కర్నూలు డివిజన్ డీడీ దుర్గాప్రసన్నబాబు ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ దుర్గా ప్రసన్న బాబు

కర్నూలు(అగ్రికల్చర్): పెయ్య దూడల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్న బాబు వైద్యులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధకశాఖ సమావేశ మందిరంలో కర్నూలు డివిజన్‌లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా పశుసంపదకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునన్నారు. లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ ద్వారా పాడిపశువుల్లో పెయ్య దూడలు పుట్టించుకోవచ్చని, దీనిని పెద్ద ఎత్తున రైతుల్లోకి తీసుకెళ్లాలన్నారు. పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ధనుంజయ పశువైద్యులకు టెక్నికల్ సెమినార్‌లో భాగంగా మాంసం ఉత్పత్తి, నాణ్యత ప్రమాణాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, శివకుమార్, టెక్నికల్ ఏడీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు యూనివర్సిటీ పీఠాధిపతికి పదోన్నతి


ముసుగు శ్రీనివాసరావుకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పత్రం అందజేస్తున్న వీసీ

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పురావస్తుశాస్త్ర పీఠంలో పీఠాధిపతి(డీన్)గా విధులు నిర్వహిస్తున్న ముసుగు శ్రీనివాసరావుకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. మంగళవారం ఆయనకు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ టి.కృష్ణారావు ఆయనకు పదోన్నతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.రమేష్, రిజిస్ట్రార్ కొనకలూరి ఇనాక్, ఎక్స్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిరీక్షణ్ బాబు పాల్గొన్నారు.